క్లుప్తంగా

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ఇన్‌కమ్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్ భూపాల్‌రెడ్డి



భూపాల్‌రెడ్డి దంపతులకు అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఏఈవో

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కోయంబత్తూర్తు ఇన్‌కమ్‌ట్యాక్స్ చీఫ్ కమిషనర్ ఎం.భూపాల్‌రెడ్డి సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను ఏఈవో నరసింహరాజు ఆయనకు అందజేశారు.

తాడి గ్రామాన్ని తరలించాలని నిరసన



నిరసన ర్యాలీ చేపట్టిన సీఐటీయూ కార్యకర్తలు

పరవాడ: ఫార్మాసిటీ సమీపంలోని తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి ప్రజలను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. తాడి గ్రామాన్ని తరలించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో శుక్రవారం నిరసన ర్యాలీ చేపట్టారు. గనిశెట్టి మాట్లాడుతూ ఫార్మాసిటీ పరిశ్రమల కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామాన్ని త్వరలో తరలిస్తామని ఇచ్చిన హామీలుగాలికి వదిలేశారన్నారు. ప్రజలు చర్మ వ్యాధులు, కిడ్నీ వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తక్షణమే తాడి గ్రామాన్ని తరలించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని గనిశెట్టి హెచ్చరించారు.

విద్యాతరంగిణి చీఫ్ వార్డెన్‌గా వినుత



హాస్టల్ వార్డెన్‌గా ఉత్తర్వులు స్వీకరిస్తున్న డాక్టర్ వినుత

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో పెరిగిన విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా వారి వసతి కోసం విద్యాభవన్‌ను విద్యార్థినుల హాస్టల్‌గా తీర్చిదిద్ది విద్యాతరంగిణిగా మార్పు చేశారు. ఈ హాస్టల్ ఇన్‌చార్జి చీఫ్ వార్డెన్‌గా ఏయూ అప్లయిడ్ మేథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.వినుత నియమితులయ్యారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు నుంచి ఆమె ఉత్తర్వులు స్వీకరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ వినుతను ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం .పవార్ తదితరులు అభినందించారు.

సీతంరాజు సుధాకర్ విజయానికి సమష్టి కృషి

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పక్కన సీతం రాజుసుధాకర్

సింహాచలం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్ విజయానికి పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. పెందుర్తి మండలం రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం సీతంరాజు సుధాకర్‌తో కలిసి ఎమ్మెల్యే పార్టీ ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదీప్ రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికీ మంచి జరుగుతోందన్నారు. కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రజలను ఆదుకున్నారన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. పార్టీ శ్రేణులంతా కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి పెద్ద ఎత్తున ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని తెలిపారు. ఉద్యోగులంతా తమ వెంటే ఉన్నారన్నారు. ఏప్రాంతం, ఏవర్గం తమకు వ్యతిరేకం కాదన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పెందుర్తి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ థీమ్ పార్క్ పనుల పరిశీలన

సింహాచలం: జీవీఎంసీ 95వ వార్డు సుజాతనగర్‌లోని రత్నగిరి నగర్‌కాలనీలో రూ.1.94 కోట్లతో నిర్మించనున్న స్పోర్ట్స్ థీమ్ పార్కు పనులను శుక్రవారం కార్పొరేటర్ ముమ్మన దేముడు పరిశీలించారు. తొలిదశలో నిర్మిస్తున్న కాంపౌండ్‌వాల్ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. నాణ్యత లోపాలు లేకుండా పనులు చేపట్టాలని.. వాటరింగ్ తప్పనిసరిగా చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. త్వరితగతిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ఏఈ నరసింహమూర్తి, వర్కు ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు ఆకుల గుణాకర్, బొడ్డు దేవుడుబాబు, కుంచా భార్గవ్ పాల్గొన్నారు.



పనుల నాణ్యతను పరిశీలిస్తున్న ముమ్మన దేముడు

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

పరవాడ: అక్రమంగా మద్యం విక్రయాలు చేపట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. ప్రభుత్వ మద్యం కలిగి ఉన్నా వారు, అమ్మినా వారిపై చర్యలు తప్పవన్నారు. మండలంలో అక్రమ మద్యం షాపులపై సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాచారాన్ని నేరుగా పరవాడ పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సీఐ కోరారు.

40 మద్యం సీసాలు స్వాధీనం

తంతడి శివారు వాడపాలెం గ్రామానికి చెందిన వి.దొరబాబు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పరవాడ ఎస్ఐ టి.మల్లేశ్వరరావు శుక్రవారం రాత్రి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. వాడచీపురుపల్లి, నాయుడుపాలెం గ్రామాల్లోని ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి దొరబాబు అక్రమంగా 40 క్వాటర్ బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని పరవాడ సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

మల్లికార్జున ఆలయ పునః నిర్మాణం ప్రారంభం



ఆలయ పునః నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు



మల్లికార్జునస్వామి

సబ్బవరం: సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని పెదనాయుడుపాలెం శివారు గణపతిపురంలో కొలువైన శ్రీసిద్ధి వినాయక, భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణ పునర్నిర్మాణ పనులను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. ఉత్తరాంధ్రలోనే అతి పురాతన, పొడవైన శివలింగం కలిగిన ఆలయంగా ప్రసిద్ధి గాంచింది. సుమారు వెయ్యేళ్ల కిందట తవ్వకాల్లో బయటపడిన పురాతన ఆలయంగా తెలియజేశారు. గ్రామస్తులు,దాతలు అందజేసిన సుమారు రూ.80 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు నాయకులు కొటాన రాము, సబ్బవరం సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీ బైలపూడి దేముడు బాబు తదితరులు ఉన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకావిష్కరణ

ఏయూక్యాంపస్ : ఆంధ్రవిశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగం పూర్వ విద్యార్థి, ఐఐటీ చెన్నై పూర్వ ఆచార్యులు సి.కాళిదాస్ రచించిన బయోఫిజికల్ కెమిస్ట్రీ పుస్తకాన్ని ఆంధ్ర మెడికల్ కళాశాల పూర్వ ఆచార్యులు జి.రఘురామారావు ఆవిష్కరించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో శుక్రవారం పుస్తకాన్ని విడుదల చేశారు. పాశ్చాత్య దేశంలో ఇప్పటికే ప్రాచుర్యం పొందిన బయోఫిజికల్ కెమిస్ట్రీపై భారత దేశంలో విద్యార్థులకు ఉపయుక్తంగా ఆచార్య కాళిదాసు ఈ పుస్తకాన్ని రచించారు. ఆవిష్కరణలో ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, కెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల పాల్గొన్నారు.

జూలో.. మరిన్ని సొగసులు



జూలో బయోస్కోప్‌పై నిర్మిస్తున్న అదనపు శ్లాబ్



హిమాలయన్ బేర్ ఎన్‌క్లోజర్ పక్కన నిర్మిస్తున్న కొత్త ఎన్‌క్లోజర్

ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల(జూ)కు మరిన్ని హంగులు చేరనున్నాయి. జూలోని జీవుల సౌకర్యార్థం కొన్ని, సందర్శకుల కోసం మరికొన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఐవోసీ సీఎస్సార్ నిధులు రూ.2 కోట్లతో ఇప్పటికే ఈ నిర్మాణాలు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొన్ని పూర్తవగా, మిగిలిన వాటిని వచ్చే నెల్లో పూర్తి చేయనున్నారు. వేసవినాటికి ఈ నిర్మాణాలు పూర్తి చేసుకుని సందర్శకులకు మరింత ఆహ్లాదాన్ని పంచనున్నట్టు అధికారులు చెప్తున్నారు.

- శరవేగంగా కొత్త నిర్మాణాలు, ఎన్‌క్లోజర్లు
- ఐవోసీఎల్ సీఎస్సార్ నిధులతో ఏర్పాటు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో అధికారులు కొత్త నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటివరకు ఇక్కడ వన్యప్రాణులు కోసం సుమారు 70 నిర్మాణాలు/ఎన్‌క్లోజర్లు ఉన్నాయి. ఇటీవల ఇక్కడికి ఇతర జూ పార్కుల నుంచి కొత్త జంతువులను తీసుకొచ్చారు. వాటి కోసం ప్రత్యేకంగా కొత్త ఎన్‌క్లోజర్లు నిర్మించారు. ఇవే కాకుండా మరికొన్ని భవనాలు నిర్మాణంలో ఉన్నాయి.

ఐవోసీఎల్ సహకారంతో

జూ అభివృద్ధి కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్) సీఎస్ఆర్ నిధులు కేటాయించింది. గత ఏడాది జూ అధికారులతో పరస్పర అవగాహనా ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకుని సుమారు రూ.2 కోట్లు అందించింది. ఆ నిధులతో జూ అధికారులు నూతన భవనాలు, ఎన్‌క్లోజర్ల నిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని ఇప్పటికే పూర్తవగా, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రస్తుతం రూ.40 లక్షలతో బయోస్కోప్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రస్తుత బయోస్కోప్ భవనంపై గత వారం అదనంగా మరో శ్లాబ్ వేశారు. ఈ ఫ్లోర్‌ను జూకి సంబంధించి సమావేశాలు, సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించే విధంగా తీర్చిదిద్దుతున్నారు.

మార్చిలోగా నిర్మాణాలు పూర్తి

దీంతో పాటు మిగిలిన నిధులతో సందర్శకుల కోసం పాముల జోన్ సమీపంలో ఆధునిక మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. కణుజుల ఎన్‌క్లోజర్‌కు ఎదురుగా ఓ నూతన ఎన్‌క్లోజర్, హిమాలయన్ బేర్ ఎన్‌క్లోజర్ పక్కన మరో ఎన్‌క్లోజర్ నిర్మాణంలో ఉన్నాయి. ఐవోసీఎల్, జూ అధికారులు మధ్య జరిగిన ఒప్పందం మేరకు కేటాయించిన సీఎస్సార్ నిధులతో ఈ ఏడాది మార్చిలోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో అధికారుల చొరవ తీసుకుని నిర్మాణాలు శరవేగంగా జరిగేలా సంబంధిత యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు ఆదేశిస్తున్నారు.

ఉగాది నాటికి గృహ నిర్మాణాలు పూర్తి

గృహ నిర్మాణ శాఖ డీఈ రాజు



సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఉగాది నాటికి జగనన్న కాలనీల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తి చేస్తామని గృహ నిర్మాణ శాఖ డీఈ ఏవీవీఎస్ఎన్ రాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం, పరవాడ మండలాల్లో 3,275 గృహాలు మంజూరయ్యాన్నారు. వీటిలో 809 గృహ నిర్మాణాలు పూర్తి కాగా.. ఉగాది నాటికి 1,636 గృహ నిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సబ్బవరంలో మండలంలో 2,193 గృహాలు మంజూరు కాగా ఇప్పటికే 487 పూర్తికాగా ఉగాది నాటికి 1,071 గృహాలు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

- పరవాడ మండలంలో 1,082 గృహాలు మంజూరు కాగా 322 నిర్మాణాలు పూర్తికావడంతో ఉగాది నాటికి 565 గృహ నిర్మాణాలు పూర్తిచేయడం లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు.

అమల్లోకి ఎన్నికల నియమావళి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

సబ్బవరం: ఉత్తరాంధ్రుల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో శుక్రవారం నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిందని తహసీల్దార్ బి. సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించకూడదన్నారు. అలాగే సంక్షేమ పథకాల హామీలు,పంపిణీ చేపట్టరాదన్నారు. రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకూడదని,ఉన్నవి వెంటనే తొలగించాలని చెప్పారు.

మండలంలో 1802 మంది ఓటర్లు

సబ్బవరం మండలంలో 1802 మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో పురుష ఓటర్లు–1,084 మంది, మహిళా ఓటర్లు–771 మంది కాగా ట్రాన్స్ జండర్ ఒకరు ఉన్నారన్నారు. సబ్బవరంలో 200 నెంబర్ పోలింగ్ కేంద్రం ఉండేదన్నారు. ప్రస్తుతం పెరిగిన ఓటర్లను దృష్టిలో పెట్టుకుని అదనంగా మరో పోలింగ్ కేంద్రం 200 ఏ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల జోలికి పోవద్దు



కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెబ్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గోపాలపట్నం: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటంలో అందరూ భాగస్వామ్యులు కావాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జాయింట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం నరవ బెహరా కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆదేశాల మేరకు సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు బానిసైతే వచ్చే అనర్థాలను వివరించారు. వీటి బారిన పడిన వారు బాగు పడరని.. కుటుంబం కూడా నష్టపోతుందని చెప్పారు. ఎక్కడైనా మాదక ద్రవ్యాలు అమ్మకాలు జరిగితే టోల్‌ఫ్రీ నంబర్ 14500కు సమాచారమివ్వాలని కోరారు. సమాచారం ఇచ్చివారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బెహరా కళాశాల డైరెక్టర్ బెహరా విజయ చైతన్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వ్యాపారులు యువకులనే టార్గెట్ చేస్తారని చెప్పారు. వీరి విషయంలో యువత చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పెందుర్తి సెబ్ సీఐ సరోజా దేవి, ఎస్ఐ శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాళ్లు సుకన్య, లీలా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగర సుందరీకరణకు కృషి చేయాలి

- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



బీచ్‌రోడ్డులో ఫుట్‌పాత్ వర్క్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు

దాబాగార్డెన్స్: నగరంలో మార్చిలో జరగనున్న రెండు అంతర్జాతీయ సదస్సులకు దేశ, విదేశాల నుంచి అతిథులు రానున్న దృష్ట్యా వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నగర సుందరీకరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జోన్–3 పరిధి సిరిపురం జంక్షన్ నుంచి ఆర్కే బీచ్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీచ్‌రోడ్డులో ఉన్న ప్రజా మరుగుదొడ్లను మెరుగుపరచాలన్నారు. ముఖ్యంగా పారిశుధ్యం, నగర సుందరీకరణ, ఇంజనీరింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బీచ్‌రోడ్డులోని ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ముఖ్యంగా సిరిపురం జంక్షన్ నుంచి వైఎంసీఏ వరకు పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు చెట్లను ట్రిమ్మింగ్ చేయడం, గోడలకు పెయింటింగ్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు లేకుండా చూడాలని, రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు వ్యర్థాలను డస్ట్‌బిన్లలో వేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పర్యటనలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కేఎస్ఎల్‌జీ శాస్త్రి, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, కార్యదర్శి నల్లనయ్య తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం గల పిల్లల గుర్తింపు



సర్వేలో భాగంగా డేటా సేకరిస్తున్న ఆశ పార్వతి, సెక్రటరీలు చిరంజీవి, శ్రావ్య

అల్లిపురం: చిన్నారులు, కౌమార దశ బాలికలు పోషకాహార లోపాన్ని అధిగమించేందుకుగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ 33వ వార్డు కుమ్మరవీధి సచివాలయం పరిధిలో 0 నుంచి 5 సంవత్సరాల పిల్లలు, 6 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలు, రక్తహీనత ఉన్న కౌమార బాలికలు 10 నుంచి 19 సంవత్సరాలు, 49 సంవత్సరాలలోపు గర్భిణుల డేటాను ఇంటింటికీ తిరిగి సేకరించారు. దీంట్లో భాగంగా పోషకాహార లోపంతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి పోషకాహారం అందించనున్నట్లు సర్వే అధికారులు తెలిపారు. సర్వేలో భాగంగా లబ్ధిదారుల తంబ్ గుర్తింపును డేటా కలెక్షన్ చేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ చిరంజీవి తెలిపారు. ఈ సర్వేలో ఆశ వర్కర్ పి.పార్వతి, వుమెన్ ప్రొటెక్షన్ సెక్రటరీ శ్రావ్య పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఎంవీపీకాలనీ : గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఫోర్త్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశాకు చెందిన జైసేన, బిపేంద్ర అనే ఇద్దరు యువకులు అరకు నుంచి 3 కిలోల గంజాయి విశాఖకు తీసుకొచ్చారు. ఇక్కడి నుంచి ఒడిశా తరలించేందుకు ప్రయత్నిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నారు. వారిని ఫోర్త్ టౌన్ పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేశారు.

శ్రీనివాస కల్యాణోత్సవం రేపు



కల్యాణ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

సీతంపేట: లోక కల్యాణార్థం ఈ నెల 12వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు సీతమ్మధార టీపీటీ కాలనీ ద్రవిడ సంక్షేమ సంఘం శ్రీలలితా నూకాల కామేశ్వరి కల్యాణ మండపంలో శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు శృతిలయ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు యు.ప్రభాకర్ తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం కల్యాణోత్సవ ఆహ్వాన పత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉదయం 10 గంటలకు అన్నమాచార్య సంకీర్తన, మధ్యాహ్నం 3 గంటలకు సీతమ్మధార త్రిమూర్తికా వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి కోలాటం, నృత్యాలతో తిరువీధి మహోత్సవం కల్యాణ మండపం వరకు జరుగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకు వైఖానస ఆగమ సంప్రదాయంలో పాణంగిపల్లి రంగనాథాచార్య స్వామి బృందంచే శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తి గీతాలాపన, నవ చైతన్య కళా నాట్య మండలి సభ్యులచే శ్రీనివాస కల్యాణం నృత్య రూపకం ఉంటుందన్నారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులకు శేషవస్త్రాలు, స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేస్తామని తెలిపా రు. కార్యక్రమంలో కల్యాణోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు ఎం.వి.రాజశేఖర్, ఎమ్మెస్ మాధవ్, మేడా మస్తాన్‌రెడ్డి, చెన్నా తిరుమలరావు, ఎస్.ఎన్.స్వామి పాల్గొన్నారు.